సాక్షి
వికారాబాద్
మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



ఆర్థికాభివృద్ధి సాధించాలి

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆవరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ అన్నారు. 8లో▸



అంత్యక్రియలకు వెళ్తుండగా..

అంత్యక్రియలకు వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తాపడి ఓ మహిళ మృతి చెందగా.. 15 మంది గాయపడ్డారు. 8లో▸



ప్రయాణం.. బురదమయం

దుద్యాల్ – అల్లిఖాన్‌పల్లి రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

న్యాస్ ఫలితాల్లో సత్తా చాటాలి

న్యాస్ రాష్ట్ర పరిశీలకుడు యాసిన్



న్యాస్ పరీక్షను పరిశీలిస్తున్న యాసిన్

మోమిన్‌పేట: న్యాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) నమూనా పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటాలని న్యాస్ రాష్ట్ర పరిశీలకుడు ఎండీ యాసిన్ పేర్కొన్నారు. సోమవారం మోమిన్‌పేట బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న న్యాస్ నమూనా పరీక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఎఫ్‌పీ డిజిటల్ బోర్డు ద్వారా బోధన పద్ధతిని మెరుగు పరుచుకోవాలని సూచించారు. న్యాస్ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో తెలంగాణ, రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానంలో నిలవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మస్తాన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి 131 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై 131 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచరాదని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేసినప్పుడే సంతృప్తి

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- జిల్లా ఆడిట్ అధికారి వీరభద్రరావుకు ఘనంగా వీడ్కోలు



వీరభద్రరావు సత్కరించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

అనంతగిరి: విధి నిర్వహణలో బాధ్యతగా పని చేసినప్పుడే ఎంతో సంతృప్తి కలుగుతుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన జిల్లా ఆడిట్ అధికారి వీ వీరభద్రరావును కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతగా పనిచేసినప్పుడే అధికారుల మన్ననలు పొందుతాడని, వ్యక్తిగత సంతృప్తి కలుగుతుందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, స్వచ్ఛ దనం.. పచ్చదనం కార్యక్రమాన్ని, మండల ప్రత్యేక అధికారిగా తన వంతు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డీఓ వాసుచంద్ర, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవితం గడపాలి

జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకన్న



రషీద్‌ను సన్మానిస్తున్న వెంకన్న తదితరులు

మోమిన్‌పేట: ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంత జీవితం గడపాలని జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకన్న పేర్కొన్నారు. సోమవారం మోమిన్‌పేటలో జిల్లా ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ రషీద్ ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. విధి నిర్వహణలో రషీద్ సమర్థవంతంగా పని చేశారని కొనియాడారు. అంతకుముందు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ సౌజన్య, జిల్లా మత్స్య అభివృద్ధి సంఘం అధ్యక్షుడు శ్రీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టుపట్టి..కొలువుకొట్టి

డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటిన అభ్యర్థులు

ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా అభ్యర్థులు సత్తాచాటారు. అత్యుత్తమ మార్కులతో మంచి ర్యాంకులు సాధించారు. తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని సంతోషం వ్యక్తంచేశారు.



గొల్ల వినీష, జిల్లా 2వ ర్యాంక్



గొల్ల శిరీష, జిల్లా 36వ ర్యాంక్

❖ అదరగొట్టిన అక్కాచెల్లెళ్లు



ఎల్లప్ప, జిల్లా స్థాయి 5వ ర్యాంక్

బషీరాబాద్: యాలాల మండలం జుంటుపల్లికి చెందిన గొల్ల మొగులప్ప బషీరాబాద్ మండలం జీవన్గీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కుటుంబంతో కలిసి తాండూరులో నివాసం ఉంటున్నారు. ఇతని భార్య మొగులమ్మతోపాటు ఇద్దరు కూతుళ్లు శిరీష, వినీష డీఎస్సీ రాశారు. వీరిలో వినీష 84.37 మార్కులతో ఎస్జీటీ జిల్లా స్థాయి రెండో ర్యాంక్, శిరీష 75.36 మార్కులతో 36వ ర్యాంకు సొంతం చేసుకున్నారు.కొద్ది తేడాలో మొగులమ్మకు ఉద్యోగం చేజారింది. ఇదిలా ఉండగా జీవన్గీ గ్రామానికి చెందిన ఎల్లప్ప ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయి 5వ ర్యాంక్ సాధించాడు.

❖ నందాపూర్ నుంచి నలుగురు



వెంకటయ్య, 2వ ర్యాంకు



రాఘువేందర్, 16వ ర్యాంకు



నరేశ్, జిల్లాస్థాయి 32వ ర్యాంకు



వేణుగోపాల్, 49వ ర్యాంకు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాందార్‌పూర్‌కు చెందిన నలుగురు అభ్యర్థులు డీఎస్సీ ఫలితాల్లో సత్తాచాటారు. గ్రామానికి చెందిన తట్టి వెంకటయ్య తెలుగు పండిత్ విభాగంలో 78.47 మార్కులతో జిల్లా స్థాయి రెండో ర్యాంకు సాధించాడు. 2018లో ఒక్కమార్కు తేడాతో ఉద్యోగం మిస్సయిన వెంకటయ్య అనంతరం కొన్నేళ్లు వీవీగా పనిచేశాడు. ఈసారి పట్టుపట్టి ఉద్యోగం కొట్టాడు. జేఎల్‌గా స్థిరపడాలనేదే తన లక్ష్యమని తెలిపాడు. అలాగే కుంబళ్ల రాఘవేందర్ ఎస్జీటీ విభాగంలో 78.53 మార్కులతో జిల్లాస్థాయిలో 16వ ర్యాంకు, కుంబళ్ల నరేశ్ ఎస్జీటీ విభాగంలో 75.80 మార్కులతో జిల్లాస్థాయిలో 32వ ర్యాంకు, మంగలి వేణుగోపాల్ ఎస్జీటీ విభాగంలో 74.67మార్కులతో 49వ ర్యాంక్ సాధించాడు.

❖ కల నెరవేరింది

దుద్యాల్: మండల పరిధిలోని లగచెర్లకు చెందిన కావాలి రమేశ్ స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం విభాగంలో 78. 27 మార్కులతో జిల్లా రెండో ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహర్నిశలు శ్రమించడంతోనే టీచర్ కావాలనే కల నెరవేరిందన్నారు. రమేశ్ ర్యాంక్ సాధించడంపై అతని స్నేహితులు, సహచర విద్యార్థులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరింత ఎదగాలని వారు ఆకాంక్షించారు.

❖ పీఎస్‌కు పంతులు ఉద్యోగం

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన మన్‌మోహన్‌సింగ్ స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం విభాగంలో జిల్లా మూడవ ర్యాంకు సాధించారు. ఈయన ప్రస్తుతం కొడంగల్ మండలంలో పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మన్‌మోహన్‌సింగ్ తండ్రి రిటైర్డ్ ఎంఈఓగా పనిచేశారు.



మన్‌మోహన్‌సింగ్, 3వ ర్యాంక్

❖ సత్తాచాటిన బాల్య మిత్రులు



జిలానీ, హిందీ 1వ ర్యాంక్



రవికుమార్, హిందీ 2వ ర్యాంక్

దోమ: మండలంలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన జిలానీ స్కూల్ అసిస్టెంట్ (హిందీ) విభాగంలో జిల్లా మొదటి ర్యాంక్ సాధించగా, మోత్కూర్‌కు చెందిన రవికుమార్ రెండో స్థానంలో నిలిచా డు. బాల్య స్నేహితులైన వీరిద్దరూ ఒకే విభాగంలో, ఒకేసారి ఉద్యోగాలు సాధించడంపై స్నేహి తులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

డీఈఓ రేణుకాదేవి



అనంతగిరి: డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నేటి నుంచి(ఒకటవ తేదీ) 5వ తేదీ వరకు ఉంటుందని డీఈఓ రేణుకాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్‌లిస్టు చేసిన 1:3 జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఈ–మెయిల్, ఎస్‌ఎంఎస్ ద్వారా వ్యక్తిగతంగా తెలియజేయడం జరిగిందన్నారు. 1:3 షార్ట్‌లిస్టు చేసిన అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. సబ్జెక్టు వారీగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ల (స్టడీ, బదిలీ – మైగ్రేషన్, కులం, పీహెచ్‌సీ, స్పోర్ట్స్, ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాల షీట్, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల కోసం చెల్లుబాటు అయ్యే ఆర్‌సీఐ సర్టిఫికెట్, బదిలీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తు ఫారం కాపీ, హాల్ టికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు)తో వెరిఫికేషన్ సెంటర్‌కు రావాలని సూచించారు. వెబ్‌సైట్‌లో లభ్యమయ్యే వెరిఫికేషన్ ఫారం కాపీ, అన్ని సర్టిఫికెట్లు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు.

వెరిఫికేషన్ సెంటర్లు

- ❖ వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో ఎస్జీటీ (అన్ని మీడియంలు)హాజరుకావాలని సూచించారు.
- ❖ వికారాబాద్ పట్టణం హైదరాబాద్ రోడ్డులోని శివారెడ్డిపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌ఏ, పీఈటీ, పండిట్‌లు హాజరుకావాలన్నారు.
- ❖ పై పేర్కొన్న తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకాకపోతే తదుపరి నోటీసు లేకుండా రిక్రూట్‌మెంట్ హక్కులు కోల్పోతారని తెలిపారు.

డ్రైవింగ్ చేస్తుండగా గుండెపోటు

- అప్రమత్తంగా వ్యవహరించిన ఆర్టీసీ డ్రైవర్
- ఘటన సమయంలో బస్సులో 40మంది ప్రయాణికులు
- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న గోపాల్‌గౌడ్



చికిత్స పొందుతున్న డ్రైవర్ గోపాల్‌గౌడ్

బషీరాబాద్: డ్రైవింగ్‌లో ఉండగా ఓ ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. క్షణాల్లో బస్సును పక్కకు నిలిపేసి, సీటులో ఒరిగిపోయాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం కాశీంపూర్ గ్రామ సమీపంలో సోమవారం చేటుచేసుకుంది. తాండూరు ఆర్టీసీ డీఎం సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ గోపాల్‌గౌడ్ విధుల్లో భాగంగా 40 మందిని తీసుకుని తాండూరు నుంచి బషీరాబాద్ వెళ్తున్నాడు. కాశీంపూర్ సమీపంలోకి రాగానే ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో అప్రమత్తమై వెంటనే బస్సును పక్కకు నిలిపేశాడు. కండక్టర్, కొందరు ప్రయాణికులు స్పందించి అతనికి సీపీఆర్ చేశారు. అనంతరం 108 అంబులెన్స్‌లో తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం గోపాల్‌గౌడ్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.



అసంపూర్తిగా ఉన్న జెడ్పీ కార్యాలయం

సేవలు అగమ్యగోచరం

- ఆరు నెలలుగా ఖాళీగానే ఉన్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ పోస్టు
- సీఈఓకు అదనపు బాధ్యతలు
- పనుల కోసం కలెక్టరేట్ బాట పట్టాల్సిన వైనం
- జిల్లా పరిషత్ ఖాతాలో ఏడాదిగా మూలుగుతున్న రూ.2 కోట్ల నిధులు
- కుంటుపడుతున్న అభివృద్ధి

వికారాబాద్: జిల్లా పరిషత్ సేవలు అగమ్యగోచరంగా తయారయ్యాయి. జెడ్పీ సీఈఓ సుధీర్‌కు ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కలెక్టర్ బాధ్యతలు అప్పగించడంతో ఆయన కలెక్టరేట్‌కే పరిమితమయ్యారు. దీంతో ఏ చిన్న అవసరం పడినా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలెక్టరేట్ బాట పట్టాల్సి వస్తోంది. దీనికి తోడు ఆరు నెలలుగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ పోస్టు ఖాళీగా ఉండటంతో పనులు సాగడం లేదు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో కీలకంగా వ్యవహరించాల్సిన జిల్లా పరిషత్ నామమాత్రంగా మారింది. ఏడాదిగా జెడ్పీ ఖాతాలో రూ.2 కోట్లు మూలుగుతున్నా.. ఖర్చు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. పాలక మండలి ఉన్న సమయంలో అవిశ్వాసం మంటలతో నిధులు ఖర్చు చేయలేదు.. ప్రత్యేకాధికారుల పాలన వచ్చినా ఆ నిధులకు మోక్షం కలగలేదు. ఆరు నెలలుగా డిప్యూటీ సీఈఓ కుర్చీ ఖాళీగానే ఉంది. సీఈఓ సైతం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో మండల పరిషత్‌ల పర్యవేక్షణ గాలిలో దీపంలా మారింది. కొంత కాలంగా జెడ్పీ పనితీరు అస్తవ్యస్తంగా మారడంతో విమర్శలకు తావిస్తోంది.

అసంపూర్తిగా జెడ్పీ భవనం

వికారాబాద్ ప్రత్యేక జిల్లాగా అవతరించాక జెడ్పీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. మూడేళ్ల క్రితం పనులు చేపట్టారు. మూడు ఫ్లోర్లలో గ్రౌండ్ ఫ్లోర్ అందుబాటులోకి రావడంతో ఇటీవల ప్రారంభించారు. కానీ మండల పరిషత్ కార్యాలయం నుంచే విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పట్లో భవన నిర్మాణం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు.

నిధులున్నా ఖర్చు చేయని వైనం..

జిల్లా పరిషత్ ఖాతాలో రూ.2 కోట్లు ఉన్నా ఏడాది కాలంగా ఖర్చు చేయడంలేదు. పాలక మండలి ఉన్న సమయంలో అవిశ్వాస సేగలతో అధికార ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటూ నిధులు ఖర్చు చేయకుండా కాలం వెల్లదీశారు. ఇప్పుడు ప్రత్యేకాధికారుల పాలన వచ్చాక కూడా ఆ నిధులకు మోక్షం లభించలేదు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ఇప్పటికైనా అధికారులు అభివృద్ధి పనుల కోసం నిధులు ఖర్చు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేను మాటల మనిషిని కాదు

- అభివృద్ధి ఏంటో చేతల్లో చూపిస్తా
- గత పాలకులు చేసిందేమీ లేదు
- తాండూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నా
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానించిన పీఏసీఎస్ పాలకవర్గం సభ్యులు

తాండూరు రూరల్: నేను మాటల మనిషిని కాదు.. అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో చూపిస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సల్లా గార్డెన్‌లో ఎల్మకన్నె పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం సీఈఓ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత పాలకులు తాండూరు అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఉత్తుత్తి జీవోలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం తాండూరును అభివృద్ధి చేస్తానని అన్నారు. తాను ఉమ్మడి రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నప్పుడు బ్యాంక్ టర్నోవర్ రూ.600 కోట్లు ఉండగా రూ.2 వేల కోట్లకు పెంచానని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో తాండూరును అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రూ.100 కోట్లతో తాండూరు – వికారాబాద్ రోడ్డు పనులకు టెండరు ప్రక్రియ సాగుతోందని తెలిపారు. రూ.200 కోట్లతో కోట్‌పల్లి, శివసాగర్, జుంటుపల్లి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. రాబోయే రెండేళ్లలో తాండూరు రూపురేఖలు పూర్తిగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉల్లి పంట నిల్వ కోసం కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవి గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు ఉత్తమ్ చందు, ధారాసింగ్, వడ్డె శ్రీను, శరణు బసప్ప, రాందాస్, ప్రశాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శివసాగర్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తాం

యాలాల: మండల రైతుల చిరకాల స్వప్నం శివసాగర్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాలాల పీఏసీఎస్ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు.ఆయనమాట్లాడుతూ.. మండలంలోని శివసాగర్, జుంటుపల్లి ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రుణమాఫీ కాని రైతులకు కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, నాయకులు కరణం పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, బాలేశ్వర్‌గుప్తా, హన్మంత్, రాములు, రాజులు పాల్గొన్నారు.

కమీషన్ డబ్బులు విడుదల చేయండి

మహేశ్వరం: రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేసిన కమీషన్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలో రాష్ట్ర సివిల్ సప్లై జాయింట్ కమిషనర్ ఎం.కే.రాథోడ్‌నును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కమీషన్ డబ్బులు సకాలంలో రాక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నట్టు చెప్పారు. ఏ నెలకు సంబంధించిన కమీషన్ అదే నెలలో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భానుచందర్ గౌడ్, డీలర్లు చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణ, విజయ్ తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

మంచాల: రైతుల సంక్షేమమే లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని, అప్పుడే కొత్త వారికి ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరుట్ల, లోయపల్లి, నోముల గ్రామాల్లో రైతు సహకార సంఘాలకు చెందిన స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. ఆక్రమణకు గురికాకుండా ప్రహరీలు నిర్మిస్తామని డీసీసీబీ చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

జాంబియా దేశానికి వాహనాల అక్రమ తరలింపు

బోర్‌వెల్ బండిని పట్టుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బోర్ వెల్ వాహనం

పరిగి: ఎలాంటి పత్రాలు లేకుండా జాంబియా దేశానికి అక్రమంగా తరలిస్తున్న బోర్‌వెల్ వాహనాన్ని పరిగి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి పట్టణ పరిధిలోని కొడంగల్ చౌరస్తాలో ఆదివారం అర్ధ రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నంబరు ప్లేటు లేని బోర్‌వెల్ వాహనం రావడంతో పోలీసులు ఆపి వివరాల అడిగారు. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను విచారించగా బోర్‌వెల్ బండిని నగరానికి తరలించి అక్కడి నుంచి కర్ణాటక మీదుగా ముంబైకి అక్కడి పోర్టు ద్వారా జాంబియా దేశానికి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ప్రతి నెలా 45 వాహనాలను అక్రమ రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఎలాంటి పత్రాలు లేకుండా ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా వాహనాలను తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వాహనాన్ని పరిగి ఎంవీఐకి అప్పజెప్పనట్లు ఎస్‌ఐ తెలిపారు. వాహనాల అక్రమ రవాణాపై పోలీసు ఉన్నతాధికారులు పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

ప్రజావాణికి పది ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు టౌన్: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, పశుసంవర్ధక శాఖకు సంబంధించి పది ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా శాఖల అధికారులతో వెంటనే సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కారు టైరు పేలి ప్రమాదం

ఒకరి మృతి



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

బొంరాస్‌పేట: కారు టైర్ పేలడంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎండీ రవూఫ్ తెలిపిన ప్రకారం.. ఫోర్డ్ ఫిగో కారు మధ్యాహ్నం కర్ణాటక రాష్ట్రం మల్కేడ్‌కు వెళ్తోంది. జాతీయ రహదారి 163పై బొంరాస్‌పేట చెరువు వద్దకు రాగానే టైర్ పేలి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న విశ్వనాథ్ వెంకటరమణయ్య(49) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్, మరో వ్యక్తి గాయపడ్డారు. విశ్వనాథ్ భాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోటారు వైండింగ్ దుకాణంలో చోరీ



దుండగులు ధ్వంసం చేసిన షటర్

తాండూరు రూరల్: మోటారు వైండింగ్ దుకాణంలో చోరీ ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం.. అల్లాపూర్ గ్రామానికి చెందిన కిరణ్ ఆస్మిత మోటార్ వైండింగ్ వర్క్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పనులు ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం 6గంటలకు దుకాణానికి వచ్చి చూడగా షటర్ తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా.. రిపేర్ చేసేందుకు వచ్చిన మోటార్లు చోరీ అయినట్లు గమనించి సీసీ కెమెరాలు పరిశీలించగా.. ఆదివారం అర్ధరాత్రి ఓ వాహనంలో మోటర్లు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడు కరన్‌కోట్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

తాండూరు రూరల్: ఆరుగురు పేకాటరాయుళ్లను కరన్‌కోట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గౌతాపూర్‌లో ఓ ఇంట్లో ఆదివారం పేకాడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వారు కరన్‌కోట్ పోలీసుల సాయంతో ఆదివారం రాత్రి దాడి చేసి జోగ్రి వీరేశం, కొస్గి నరేందర్, కులకర్ణి రాఘవేందర్, కుర్వ మల్లికార్జున్, సల్వా నర్సింలు, కుమ్మరి జగదీష్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.33,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అర్ధశతాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయండి

పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు టౌన్: ఉస్మానియా వర్సిటీలో ఈ నెల 24 నిర్వహించనున్న పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం తాండూరు డివిజన్ అధ్యక్షుడు నవీన్, కార్యకర్తలు భాను, ప్రకాష్, అరుణ్, మహేష్, నందిని, భానుప్రియ, విజయ, శిరీష, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాలాల: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను యాలాల పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎస్‌ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అచ్యుతాపూర్ శివారులో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టగా ఓ ట్రాక్టర్‌ను పరిశీలించగా ఎటువంటి అనుమతులు లేవు. దీంతో పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. యజమాని వెంకటప్పపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వారిపై ఉక్కుపాదం

- అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవు
- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ
- ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

అనంతగిరి: ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడినా.. మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా.. గంజాయి తదితర మత్తు పదార్థాల జోలికి వెళ్లినా కఠిన చర్యలు తప్పవని మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి వికారాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పీఎస్‌లో నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ ఫైల్స్‌పై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజలు మెచ్చేలా పని చేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమరవాణా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై రికార్డ్స్ నమోదు చేసి వెంటనే సస్పెక్ట్ షీట్స్ తెరవాలన్నారు. ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లు, ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. సస్పెక్టెడ్ రౌడీ షీటర్స్ రోజువారి కార్యాచరణపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సమష్టిగా పని చేయాలని సూచించారు. క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ పెంపొందించుకుని నేరస్తులకు శిక్షపడేలా చూడాలన్నారు.

చొరవ తీసుకోవాలి

పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలకు సంబంధించిన కేసులలో పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పనిచేయాలన్నారు. డీజీపీ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలను నిరోధించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపైన చర్యలు తప్పవని తెలిపారు. మర్పల్లి ఠాణా పరిధిలో పేకాట కేసులలో ఇద్దరు నేరస్తులకు ఎస్పీ ఆధ్వర్యంలో ఐజీ కౌన్సిలింగ్ ఇచ్చి సస్పెక్ట్ షీట్ నమోదు చేశారు. ఈ సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, వికారాబాద్, తాండూర్, పరిగి డీసీపీ, సీఐలు, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద లక్షణాలను గుర్తించాలి

ఐదుగురు తల్లుల మరణాలపై డీఎంహెచ్‌ఓ పల్వాన్‌కుమార్ సమీక్ష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పల్వాన్‌కుమార్

అనంతగిరి: ఇటీవల మాతృమరణాలు పెరగడంతో డీఎంహెచ్‌ఓ పల్వాన్‌కుమార్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పవిత్ర, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, వైద్యాధికారులు, ఆశవర్కర్లతో జిల్లాలో చోటుచేసుకున్న ఐదుగురు తల్లుల మరణాలపై కేసుల వారీగా సంబంధిత వైద్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది సేవా లోపం, అజాగ్రత్తల వల్ల గర్భవతులకు, బాలింతలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాద లక్షణాలున్న గర్భవతులను ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. అధిక ప్రమాదకరంగా ఉన్న గర్భవతులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు ఉన్నత శ్రేణి ఆస్పత్రిలో ప్రసవం అయ్యేలా చూడాలని సూచించారు. గర్భవతి, బాలింత, పుట్టిన శిశువు ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రనాయక్, శ్రీనివాసులు, వైద్యాధికారులు, సిబ్బంది, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఓఎంఐఎఫ్ సంస్థ కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఏపీఎం వెంకన్న

కొడంగల్ రూరల్: ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్(ఓఎంఐఎఫ్) సంస్థ కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని సమాఖ్య కార్యాలయంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు సంఘాలుగా ఏర్పడుతూ సమాఖ్య ఆధ్వర్యంలో రుణాలు తీసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. సంఘాలు ఏర్పడడంతో మహిళలు తమకు చేతనైనంతలో కొంత మొత్తం జమ చేసుకునేందుకు వీలుంటుందన్నారు. తద్వారా బ్యాంకుల్లో రుణాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ ఉషశ్రీ, ఏపీఎం వెంకన్నలు పలు సూచనలు అందిస్తూ గ్రామాల్లో మహిళలు సంఘాలను బలోపేతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఓఎంఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ నారాయణ, మండల కో ఆర్డినేటర్ ఇస్వప్ప, ఈశ్వరమ్మ, హెల్త్ వర్కర్ విజయలక్ష్మి, భారతమ్మ, బాబమ్మ, అనంతమ్మ, బాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు

డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్

తాండూరు రూరల్: అంకిత భావంతో పనిచేసే అధికారులకు ప్రజల నుంచి గుర్తింపు లభిస్తుందని డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ అన్నారు. పదవీ విరమణ పొందిన నైట్ వాచ్‌మెన్ అనంతయ్య, బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, అటెండర్లను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో అధికారులు ఉత్తమంగా పనిచేస్తే ప్రజాప్రతినిధులకు సైతం మంచి పేరు వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు విశ్వప్రసాద్, సుదర్శన్, ఎంపీఓలు రతన్‌సింగ్, ఆనంద్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల బృందం తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్లిన సిబ్బందిని సన్మానిస్తున్న రవిగౌడ్

రాడార్ కేంద్రం వద్దంటూ నిరసన



పూడూరు చౌరస్తాలో ఆందోళన వ్యక్తం చేస్తున్న నాయకులు

పూడూరు: ప్రజలకు ఇబ్బందులు సృష్టించే నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని టీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నేవీరాడార్ కేంద్రం ఏర్పాటును నిరసిస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గ్రామస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవరాశులు, పశుపక్షాదులకు ఆశ్రయంగా ఉన్న దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని కాలుష్య కోరల్లోకి నెట్టేయరాదన్నారు. పచ్చటి అడవి, చెట్లను తొలగిస్తే భవిష్యత్ తరాలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రాడార్ ఏర్పాటును విరమించుకోవాలని, లేదంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

ఒకరి పరిస్థితి విషమం

యాలాల: ఎదురుగా వస్తున్న బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం తాండూరు పట్టణ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం అనుబంధ గ్రామం బండమీది తండాకు చెందిన అనిల్ రాథోడ్, శ్రీను రాథోడ్ బైక్‌పై తాండూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో తాండూరు నుంచి కొడంగల్ వైపు ప్రయాణిస్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనిల్‌రాథోడ్ పరిస్థితి విషమించడంతో నగరానికి రిఫర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి.. శవమై తేలి

బషీరాబాద్: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గఫార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని జీవన్గి గ్రామానికి చెందిన తోట మొగులప్ప(33) శనివారం కాగ్నా నదిలో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వంతెన కింద గుంతలో పడి మునిగిపోయాడు. సోమవారం మృతదేహం పైకి తేలడంతో గమనించి గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శవం కుళ్లిన స్థితిలో ఉండడంతో ఘటనా స్థలిలోనే పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య చంద్రకళ, మూడేళ్ల కూతురుంది. మృతుడి తండ్రి ఎంకప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా విక్రయిస్తే జైలు

పెద్దేముల్: సారా విక్రయిస్తే జైలు శిక్ష తప్పదని పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మదనపూర్ తండాలో పాండునాయక్ ఇంట్లో సారా ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి వారి వద్ద నుంచి లీటర్ సారా స్వాధీనం చేసుకున్నారు. కానిస్టేబుల్ కృష్ణ తహసీల్దార్ కిషన్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రెండో సారి పట్టుబడితే రూ.2లక్షల జరిమానాతో పాటు జైలు శిక్షవిధిస్తామని హెచ్చరించారు.

మధ్యంతర బెయిల్ కోసం జానీ మాస్టర్ పిటిషన్

రంగారెడ్డి కోర్టులు: లైంగికదాడి ఆరోపణల నేపథ్యంలో చంచల్‌గూడా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న నృత్య దర్శకుడు జానీ మాస్టర్ మధ్యంతర బెయిల్ కోరుతూ రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో, 9వ అదనపు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఢిల్లీలో జరగనున్న కార్యక్రమానికి తాను తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉన్నందున మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసాడు. ఈ పిటిషన్‌పై మంగళవారం ప్రాథమిక విచారణ జరగనుంది. కాగా జానీ మాస్టర్ దాఖలు చేసిన సాధారణ బెయిల్ పిటిషన్‌ను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

వ్యవసాయ సహాయకులను నియమించండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం వినతి

అనంతగిరి: వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఏఈఓలపై పనిభారం మోపడం తగదని.. ప్రభుత్వం స్పందించి ప్రతీ గ్రామానికి వ్యవసాయ సహాయకులను నియమించాలని వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం వికారాబాద్ జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ఒక్కో ఏఈఓకు 1-10 గ్రామాలు అప్పగించారన్నారు. వీటితో పాటు రైతుబంధు, రైతుబీమా, పీఎం కిసాన్, పంట నమోదు, పంట నష్టం సర్వే, పంటకోత ప్రయోగాలు, కొనుగోలు కేంద్రాలు, రైతు నేస్తం తదితర కార్యక్రమాల నిర్వహణ బాధ్యతతో పాటు ప్రభుత్వం వివిధ ఇతర శాఖలలో చేపడుతున్న కార్యక్రమాలను అమలు చేయడంలో ఏఈఓల సేవలను వినియోగించుకుంటుంది. సుమారు 9 వేల ఎకరాల వరకు సాగుభూమిలో ఒకే ఏఈఓ పరిధిగా ఉందన్నారు. దీంతో పని ఒత్తిడి పెరిగి ఏఈఓలు మానసికంగా ఇబ్బంది పడుతూ అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఐజాక్ హెరాల్డ్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, అసోసియేటెడ్ కార్యదర్శి మశ్చేందర్, కోశాధికారి వంశీకృష్ణ, జిల్లా నాయకులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఈఓలు

ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

పరిగి: ప్రతి ఒక్క కార్మికుడు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణ పరిశుభ్రంగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ పరిగి కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛహిత సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాలను పరీక్షించుకోవాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా ఆరోగ్య సమస్యలు ఏమైన ఉంటే తెలుస్తాయని, ఉచితంగా మందులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగేశ్వర్, వెంకటేష్, రవికుమార్, మీర్ తహేర్‌అలీ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



అమృతమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



క్షతగాత్రులను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

అంత్యక్రియలకు వెళ్తుండగా..

ట్రాక్టర్ బోల్తా

- ఒకరి మృతి.. 15మందికి గాయాలు



బోల్తాపడిన ట్రాక్టర్

దౌల్తాబాద్: అంత్యక్రియలకు వెళ్తుండగా ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడి ఓ మహిళ మృతి చెందగా.. 15 మంది గాయపడ్డారు. ఈ ఘటన దేవర్‌ఫసల్‌వాద్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. నాగసార్‌లో చనిపోయిన బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ఈర్లపల్లి గ్రామస్తులు ట్రాక్టర్‌లో బయలుదేరారు. దేవర్‌ఫసల్‌వాద్ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ట్రాలీ బోల్తా పడగా అమృతమ్మ అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. కిష్టప్ప, నర్సప్ప, అచ్చప్ప, కవిత, దస్తమ్మ, భీమమ్మ, బసప్ప, నర్సమ్మ, మల్కప్ప, భీమప్ప, వెంకటమ్మ, లక్ష్మమ్మ, బిచ్చప్ప, వెంకటప్ప, లాలప్ప గాయపడ్డారు. గమనించిన చుట్టుపక్కల రైతులు క్షతగాత్రులను కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అజాగ్రత్తతోనే ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అంబులెన్స్ ఆలస్యం

ట్రాలీ కింద పడిన బాధితులు గాయాలతో రోదిస్తుండగా స్థానిక రైతులు 108కు సమాచారం ఇచ్చారు. ఉదయం 11.15 నిమిషాలకు ఫోన్ చేయగా 12.40 గంటలకు అంబులెన్స్ వచ్చింది. అప్పటికే బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు క్షతగాత్రులను ఆటోల్లో కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో 108 అందుబాటులో లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తంచేశారు.

ప్రతి రైతుకూ రుణం ఇస్తాం

ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దేముల్: రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తేనే బ్యాంకు అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడేళ్ల నుంచి పర్మినెంట్ ఎండీ లేక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రైతులకు పంట రుణాలతో పాటు ఎరువులు అందజేస్తున్నామన్నారు. ప్రతి రైతుకు పంట రుణం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎండీ శ్రీనివాస సాగర్‌రెడ్డి, మేనేజర్ మురళీగౌడ్, డైరెక్టర్లు నారాయణరెడ్డి, రవిశంకర్, బస్వరాజ్, రమ్యా, దస్తప్ప, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వనరులు సమకూర్చాం

బషీరాబాద్: నష్టాల్లో కూరుకుపోయిన సొసైటీని మూడేళ్లలో లాభాల్లోకి తీసుకు వచ్చామని నావంద్గీ సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి అన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విక్రయాల ద్వారా ఈ ఏడాది రూ.80 లక్షల ఆర్థిక వనరులు సమకూరినట్లు వెల్లడించారు. సోమవారం సొసైటీలో చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రైతులకు ఈ ఖరీఫ్‌లో రూ.1.20కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, డైరెక్టర్లు రంగారెడ్డి, అశోక్ గౌతం, శ్రీనివాస్ రెడ్డి, నవీన్‌రెడ్డి, హన్మిరెడ్డి, రూప్లనాయక్, అనుసూయ బాయి, సీఈఓ బందెయ్య, వెంకటయ్య, సిబ్బంది ఫారూక్, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో చెల్లించాలి

పరిగి: రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పరిగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, సీఈఓ అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధి ముఖ్యం

నవాబుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను అభివృద్ధి చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ పోలీసు రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మల్లారెడ్డి, ప్రభు, కిష్టయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

329 మందికి రుణమాఫీ

మోమిన్‌పేట: ప్రాథమిక సహకార పరపతి సంఘం నుంచి తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి దోహద పడాలని మోమిన్‌పేట పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘంలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను తీసుకొన్న రైతులు సకాలంలో చెల్లించాలన్నారు. సంఘంలో రుణమాఫీ 329 మంది రైతులకు రూ.2.61కోట్లు మాత్రమే మాఫీ అయిందన్నారు. సంఘం లాభాల్లోకి వచ్చేందుకు ప్రతి సభ్యుడి కృషి అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, డైరెక్టర్లు శేఖర్, వైరెడ్డి, రైతులు, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్: మాట్లాడుతున్న చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



బషీరాబాద్: చెక్కు అందజేస్తున్న చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి